విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 02, మార్చి 2025

మారేమడుగులలో గ్యాస్ పేలుడు

విశాలాంధ్ర-అవుకు : మండలంలోని మారేమడుగుల గ్రామంలో శుక్రవారం రాత్రి గ్యాస్ పేలుడు సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మారేమడుగుల గ్రామంలోని లక్ష్మీకాంత్ రెడ్డి ఇంటిలో రాత్రి 9గంటల సమయంలో గ్యాస్ లీక్ అయ్యి మంటలు రాగాయి. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంటిలోని ఆరు బస్తాల బియ్యము, 8క్వింటాళ్ల వాము, లక్ష రూపాయల నగదు పూర్తిగా కాలిపోయాయి అని అన్నారు. ఐదు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో ఈనెల 3నుండి జరగనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశించారు. శనివారం అహోబిలంలో జరిగిన బ్రహ్మోత్సవ ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో కలసి కట్టుగా పని చేయాలని కోరారు. రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, పోలీస్ శాఖ, ఫారెస్ట్ తదితర అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష జరిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు మరియు టాయిలెట్స్ వంటివి ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. బస్సు సౌకర్యం,ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బారికేడ్స్ ఏర్పాటు చేసి సరైన భద్రత కల్పించాలని ఎక్కడ తొక్కిసలాటలు జరగకుండా క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ కోత లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, మఠం జనరల్ మేనేజర్ మురళీధరన్, ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్, ఎమ్మార్వో జ్యోతి రత్నకుమారి, రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి, వైకుంఠం, ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, డిఈఈ రవికాంత్ చౌదరి, రూరల్ ఎస్సై హరిప్రసాద్, మనీయార్‌లు సౌమ్య నారాయన్, సుదర్శన్‌లు, ఎంపీడీవో కార్యాలయ ఏవో హనీఫ్ ఖాన్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలో ప్రజల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. శనివారం మంత్రి బనగానపల్లె పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జుర్రేరు వాగులోకి మురికి నీరు కలవకుండా, ప్రత్యామ్నాయంగా కొత్తగా పట్టణంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆస్థానం వద్ద నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. సీసీ రోడ్ల పనులు సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని, అదే సమయంలో పనుల నాణ్యతా విషయంలో రాజీపడకుండా నిర్మాణాలు చేపట్టాలని కాంట్రాక్టర్లకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ నాగ శ్రీనివాసులు, ఏఈ వెంకటరమణ, ఎంపీడీవో వెంకటరమణ, ఈవో ఆర్ డి సతీష్ కుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు కాసింబాబు, పిఏ మురళి మోహన్ రెడ్డి, ఇస్మాయిల్ ఖాన్,అత్తర్ కలం,వెల్కమ్ ఆల్తాఫ్, హాజీ, అన్ను అర్బన్ రూలర్ సిఐలు మంజునాథ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ ఎస్సై దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి శాలలో చోరీ.. ఊరి బయట హుండీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా, శిరివెళ్ల మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల దేవస్థానంలో శనివారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. మోకాలు (ఫేస్‌లు) కనిపించకుండా మాస్కులు ధరించి కేవలం అది కొద్ది సమయంలోనే అమ్మవారి శాలలోకి ప్రవేశించి గుడిలోఉన్న ఆలయ హుండీని ఎత్తుకెళ్లారు. శిరివెళ్ల గ్రామం చివర రుద్రవరం రస్తా వైపు వెళ్ళి హుండీలో ఉన్న సొమ్మును తీసుకొని వదిలేసి వెళ్లారు. శిరివెళ్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సిసి ఫుటేజీ లను పరిశీలించి చోరీకి పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారి ప్రక్కన ఉన్నటువంటి అమ్మవారి శాల నిత్యం సీసీ కెమెరాలు నిఘా నీడలో ఉంటాయని అటువంటి భద్రతా వలయంలో దొంగలు చోరబడడం శిరివెళ్లలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పగడ్బందీగా ఇంటింటి ఆరోగ్య సర్వే

విశాలాంధ్ర-అవుకు : పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఇంటింటి ఆరోగ్య సర్వేని నిర్వహించారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తూ కుటుంబ సభ్యులందరికీ బిపి,షుగర్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు ఉంటే వాటిని గుర్తించి మెడికల్ ఆఫీసర్ పరీక్షల అనంతరం నిర్ధారణ అయితే వారిని నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి మంగళవారము, గురువారాలలో రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వే గల సంవత్సరం నవంబర్ 14వ తేదీ నుండి కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మదారమ్మ, ఎం ఎల్ హెచ్ పి జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - చాగలమర్రి : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆళ్ళగడ్డ రూరల్ సిఐ మురళీదర్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేసామన్నారు. పరీక్షలు పూర్తి అయ్యేదాకా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులకు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్ లాంటి వాటికి అనుమతులు లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పోలీస్ చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చీఫ్ సూపరెండెంట్ పెద్దయ్య,డిపార్ట్‌మెంటల్ అధికారి చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 341మంది హాజర్ కావాల్సి ఉండగా 317మంది హాజరు కాగా24 మంది గైర్హాజరు అయ్యారన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐ నబి, పోలీస్ సిబ్బంది, జిఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులను వాకబ్ చేసిన ఎంపీ

విశాలాంధ్ర - వెలుగోడు : రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంటు సభ్యురాలు వెలుగోడు మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినీలతో చరవాణి ద్వారా పరీక్షల గురించి వాకబ్ చేశారు. ఈరోజు జరిగిన పరీక్షలు ఎలా వ్రాశారు. అలాగే మీరు మిగతా పరీక్షలను కూడా ఎలాంటి భయాందోళన చెందకుండా, ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలని, పరీక్షలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలియజేశారు. మీకు అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. నూరు శాతం ఉత్తీర్ణ సాధనకు కృషి చేస్తామని విద్యార్థులు ఎంపీకి చెప్పారు.

మహానందీశ్వరున్ని దర్శించుకున్న యువనేత

విశాలాంధ్ర - మహానంది : టీడీపీ రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్ శనివారం ప్రముఖ పుణ్య క్షేత్రం మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. ఈసందర్భంగాదేవస్థానం ముఖమండపం వద్ద ఆలయ అధికారులు వేద పండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎన్ఎండి ఫయాజ్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వేదఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు ఫయాజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి రాజేశ్వరరావు స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీస్ ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్లు మిట్నాల రాజేశ్వర రెడ్డి, అశోక్, ఖలీల్, ప్రసాద్ బుగ్గ రాముడు, సుధాకర్, అంకాల్, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా..

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్ అని టిడిపి రాష్ట్ర కార్యదర్శిగడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలో పలు వీధులలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేశారు. ఆయన మాట్లాడుతూ ఒకటోతేదీ పింఛన్ పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల వారికి సుభిక్షమైన పాలన అందిస్తున్నా రనిఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజులపాటు మహిళా సాధికారతపై అనేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాల పట్టణం ఇండోర్ స్టేడియం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, అడిషనల్ ఎస్పీ మంద జావలి ఆల్ఫెన్స్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి లీలావతి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మొదటి రోజు ఆడబిడ్డ పుట్టగానే బిడ్డను అభినందిస్తూ బిడ్డ పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని, అలాగే గతంలో మహిళలు సాధించిన విజయాలను గుర్తుకు తెచ్చుకుంటూ స్మరించుకోవాలన్నారు. సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలను గుర్తించి సంబంధిత మహిళలకు చేయూతనందించి స్వశక్తితో ఎదిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్త్రీ పారిశ్రామికవేత్తగా రాణిస్తే వేలాది మంది మహిళలను భాగస్వామ్యం చేయడమే కాకుండా సంబంధిత మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేటట్లు చేయొచ్చని కలెక్టర్ తెలిపారు. స్త్రీ పురుష తారతమ్యం లేకుండా పిల్లలను మంచిగా చదివించి ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజాన్ని ముందుకు నడిపించే స్థాయికి తీసుకురావాలన్న ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. అంతకుముందు ఇండోర్ స్టేడియంలో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి,సిపిఓ వేణుగోపాల్, భూగర్భ జల శాఖ డిడి రఘురాం, ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గేదలు సజీవ దహనం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా, శిరివెళ్ల మండల పరిధిలోని మహదేవపురం గ్రామపంచాయ తీలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు పాడి గేదెలు సజీవ దహనం అయినట్లు బాధిత పాడి పరిశ్రమ రైతు షేక్ నడిపి హుస్సేన్ సాహెబ్ కుమారుడు షేక్ మహబూబ్ బాషా కుటుంబం సభ్యులు విలపించారు. గాఢ నిద్రలో ఉన్న గ్రామస్తులను ఆకస్మికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒక్కసారిగా సంభవించిన మంటలు ఎగిసిపడడంతో గ్రామస్తులు ఉలికి పాటుకు గురయ్యారు. 20 పాడి గేదెలను పెంచి పోషిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబానికి బారి అగ్ని ప్రమాదం పెను శాపంగా మారింది.ఏడు గేదలు సజీవ దహనం కాగా మరో ఐదు గేదెలు తీవ్ర గాయాలతో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బాధిత రైతుకు అగ్ని ప్రమాదం వల్ల ఊహించని రీతిలో భారీగా నష్టం వాటిల్లినట్లు మహాదేవపురం టిడిపి నేత వెలుగోడు మహేష్ యాదవ్ తెలిపారు. సంఘటనా స్థలానికి తాసిల్దార్ పుష్పకుమారి, ఆర్ఐ రాఘవేంద్ర కుమార్ శర్మ, వీఆర్వో చెన్నయ్య ఇతర అధికారులు ప్రముఖులు చేరుకొని నష్టం అంచనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. జరిగిన సంఘటనను జిల్లా కలెక్టర్ గారికి నివేదిక పంపనున్నట్లు తాసిల్దార్ పేర్కొన్నారు. 20 గేదెలను పెంచి పోషిస్తూ నీడ కల్పించిన పశువుల ఫారం షెడ్డు కాలి బూడిద అయ్యిందని సుమారు 12 గేదెలు మృత్యువాత పడినంత పని కావడంతో భారీ నష్టం వాటిల్లిందని బాధితులు బోరున విలపించారు 12 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంబంధించినట్లు గ్రామస్తులు తెలియజేశారు.తమ జీవనాధారమైన పాడి పరిశ్రమను అగ్నిప్రమాదం రూపంలో కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని పశుసంవర్ధక శాఖ రెవెన్యూ శాఖలకు బాధిత రైతు షేఖ్ మహబూబ్ సాహెబ్ కుటుంబ సభ్యులు మొర పెట్టుకున్నారు.

పేదల సంక్షేమానికి పెద్ద పీట

విశాలాంధ్ర - ప్యాపిలి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలను దృష్టిలో ఉంచుకొని గతంలో 2000 రూపాయల ఉన్న పింఛన్లను రూ.4వేలు పెంచి పేదలకు మా ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడిపాడు, పెద్దపాయి గ్రామాలలో పేదలకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే చెరువులకు నీరు నింపి రైతులను ఆదుకుంటామని అంతేకాకుండా గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించాలని గ్రామాలలో రాబోవు వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా దీనికి సంబంధించిన అధికారులు పరిష్కరించాలని ఆయన అన్నారు. గుడిపాడు గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నదని ఆయన దృష్టికి తీసుకుపోగా తక్షణమే దీనికి సంబంధించిన అధికారులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, గుడిపాడు టిడిపి నాయకులు రంగారెడ్డి, సుధాకర్, ఓబులేసు, టిడిపి నాయకులు నారాయణ మూర్తి, తొప్పల శ్రీనివాసులు,ఖాజా పీరా, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు పునాదులు

విశాలాంధ్ర-డోన్ : నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులని డోన్ రూరల్ సీఐ సీఎం .రాకేశ్ అన్నారు. శనివారం అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవై ఎఫ్)డోన్ మండల సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర క్యాలెండర్‌ను డోన్ రూరల్ సీఐ సి ఎంరాకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తూ చదువుతూ పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, డోన్ మండల కార్యదర్శి జి. పృథ్వీ కుమార్, అధ్యక్షుడు హరికృష్ణ, డోన్ పట్టణ అధ్యక్షుడు దివాకర్, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ఇద్దరి జీవితాలకు వెలుగులు నింపిన వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం స్టేట్ బ్యాంక్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని ఓప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వెంకటేశ్వర్లు మృతి చెందడంతో మృతుడి కళ్ళను నేత్రదానం చేసేందుకు కుటుంబ సభ్యులైన భార్య పద్మావతి, కుమార్తెలు లక్ష్మీ కుమారి, సుమలత,మంజుశ్రీ,మహేశ్వరి కర్ణ ముందుకు వచ్చారు. నంద్యాలలోని ఫ్రెండ్స్ ఫర్ సేవా సొసైటీ ప్రతినిధులు బాపూజీ నాయక్, కిషోర్ లను సంప్రదించారు. వారు వెంటనే కర్నూలులోని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థకు విషయం చెప్పడంతో మెడికల్ టెక్నీషియన్స్ నంద్యాలకు చేరుకొని నంద్యాలలోని రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ దస్తగిరి సమక్షంలో రెండు కళ్ళను సేకరించి హైదరాబాదులోని ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ కు తరలించారు. రెండు కళ్ళను దానం చేసి రెండు జీవితాలకు వెలుగులు నింపాలనే ఆలోచన చేసిన మృతుడి కుటుంబసభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ సేవా సొసైటీ డైరెక్టర్ ప్రదీప్, చైర్మన్ విష్ణు గాయత్రి,ఫౌండర్ ఫణీంద్ర సహకారం అందించారు.

రాబోయే రోజుల్లో ఒక్క సీటే గతి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాబోయే రోజుల్లో వైకాపా పార్టీకి 11సీట్లు కాదు కదా కేవలం ఒక్క సీటుకే ప్రజలు పరిమితం చేస్తారని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. స్థానిక అమ్మవారి శాల వీధిలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద బడ్జెట్ ఉన్న లేకున్నా ప్రజలకు ఒకటో తారీఖున పింఛన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో సమయానికి పింఛన్ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్ హుస్సేన్ భాష, టిడిపి నాయకులు జాఫర్ రెడ్డి, చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, సోముల శేఖర్ రెడ్డి, శబరిష్ సత్యం, గుండామణి, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గడివేములకు బైపాస్

విశాలాంధ్ర -గడివేముల : 2024 ఎన్నికల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి గడివేముల గ్రామానికి బైపాస్ రోడ్డు వేసి ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీరుస్తామని మాట ఇచ్చిన ఎనిమిది నెలల్లోనే బైపాస్ రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించినందుకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాస్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి పంటా రామచంద్రారెడ్డి, గడిగారేవుల కంది శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పింఛన్‌లు పంపిణీ చేసిన ఎన్ఎండీ ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం 15వ వార్డు గోపాల్ నగర్ నందు లబ్ధిదారుకు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావులు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వార్డు ఇంచార్జ్ ఎబినేజర్ ఆధ్వర్యంలో గోపాల్ నగర్లోని ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేసిన ఫయాజ్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.2వేలు ఉన్న పెన్షన్‌ని రూ.3వేలు పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని, ఏట రూ.250 పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని, నేడు సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం రూ.3వేలు పింఛన్‌ని రూ.4వేలు పెంచారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులకు, సచివాలయ సిబ్బందికి, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు ప్రజలకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఖలీల్, తాటికొండ బుగ్గ రాముడు, బాలా అకాడమీ రవి, రమేష్ పాల్, సుధాకర్, అంకాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం నాడు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనం తరం సాయంకాలం అశ్వవాహన సేవ, పుష్ప ఉత్సవం సైనోత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు ముగిశాయి. స్వామి అమ్మవార్ల ఉత్సవము ర్తలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ఉత్సవం నిర్వహించారు. అనంతరం అద్దాల మండపం వద్ద స్వామి వారికి పుష్పోచ్చవ సేనోచవ కార్యక్రమాలను అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించడంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పనిచేసినటువం టి అధికారులకు సిబ్బందికి ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరి సమన్వయంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో విజయవంతంగా నిర్వహించి స్వామి అమ్మ వార్ల దర్శనానికి వచ్చినటువంటి భక్తులకు ఎటు వంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకో వడంతో పాటు అధికారులు సిబ్బంది సమన్వయంతో ఎటువంటి ఇబ్బంది కలక్కుండా విజయవం తంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తి చేసినం దుకు అధికారులకు సిబ్బందికి కార్య నిర్వహణ అధి కారి ఎం.శ్రీనివాసరావు అభినందనలు ధన్యవా దాలు తెలిపారు. ఉగాది మహోత్సవాలను కూడా విజయ వంతం చేసేందుకు అందరూ సమిష్టి కృషితో పనిచే యాలని కోరారు. ఉగాది మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశా నికి ఆలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని నీలితొట్ల వీధిలో ఇటీవల వాంతులు, విరేచనాలతో మృతి చెందిన రహంతుల్లా కుటుంబ సభ్యులను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సతీమణి బుడ్డా శైలజమ్మ పరామర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా కల్పించారు. అనంతరం నీలితొట్ల వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్ని విధాలుగా ఆదుకుంటారని హామీ ఇచ్చారు. వీరి వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు వేణు, పట్టణ కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేగడ గూడూరులో.. దొంగలు హల్చల్

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలోని రేగడగుడు గ్రామంలో గత 24వ తేదీ రాత్రి దొంగలు నాలుగు ఇళ్లలో దొంగతనానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే రెండు ఇండ్లలో మాత్రమే వస్తువులు దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. మంజుల వెంకటరమణ ఇంటిలో తాళం కొక్కెను కత్తిరించి ఇంటి లోపల బీరువాలు తెరిచి మూడు జతల కమ్మలు, మూడు జతల మాటీలు, ఒక జత రింగులు యాభై వేల రూపాయలు నగదు దోచుకొని వెళ్లారు. అలాగే సునీత ఇంటిలో నాలుగు బంగారు గుండ్లు , చిన్న కమ్మలు దొంగలించినట్లు బాధితులు పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి దొంగతనం జరిగిన విధానాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దొంగతనాలు బట్టి పోలీసుల నిఘా,పర్యవేక్షణ తగ్గినట్లుగా ప్రజలు భావిస్తున్నారు. 2024 అక్టోబర్ రెండవ తేదీన వేల్పనూరు గ్రామంలోని పూజారి, లాయరు అయిన వెంకటేశ్వర్లు ఇంటిలో దొంగతనం జరిగింది. 16 తులాల బంగారు నగలు, రూ.30వేలు నగదు దోచుకుని వెళ్లారు. ఆ దొంగతనం ఇప్పటికీ విచారణ దశలోనే ఉంది. పోలీసులు ఈ దొంగతనాల కేసును త్వరగా తేల్చాలని, సొమ్ములను రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

దుర్గా భోగేశ్వరుడి హుండి లెక్కింపు

విశాలాంధ్ర-గడివేముల : మండల పరిధిలోని శ్రీదుర్గా భోగేశ్వరాలయ హుండీని శనివారం నాడు లెక్కించినట్లు ఆలయ ఈవో రామానుజం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకొని హుండీ, టికెట్లు ఆదాయం స్వామివారి సదివింపులు అంగళ్ళ వేలానికి ఇచ్చిన మొత్తం మూడు లక్షల 49 వేల 394 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, రమణ ,ప్రజలు పాల్గొన్నారు.

సృజనాత్మకతని ఉపాధ్యాయులు వెలికితీయాలి

విశాలాంధ్ర- బనగానపల్లె : విద్యార్థుల సృజనాత్మక శక్తిని ఉపాధ్యాయులు వెలికితీయాలని బీసి ఇందిరా రెడ్డి తెలిపారు. బనగానపల్లె జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులందరికీ సైన్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ నుంచి పరిశీలించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిర రెడ్డి మాట్లాడుతూ, పిల్లలతో కలిసి గడిపే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని, వారు తయారుచేసిన ప్రదర్శనలు చాలా అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 02, మార్చి 2025

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: కామన్ పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని, పీజీ ప్రవేశ పరీక్షలను ఆయా యూనివర్సిటీలకే అప్పజెప్పాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, జీవో 77ను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో ఉన్నత విద్యకు అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాయలసీమ విశ్వవిద్యాలయం నందు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సంఘం నాయకులు రాజీవ్, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు రామరాజులు హాజరై, మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన కామన్ పీజీ సెట్ పేరుతో అన్ని యూనివర్సిటీలను ఉమ్మడిగా ప్రవేశ పరీక్షలను నిర్వహించడం జరిగిందని, దీని ద్వారా పీజీ విద్యలో ప్రవేశాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పీజీ ప్రవేశ పరీక్షలను యూనివర్సిటీలే నిర్వహించే స్వేచ్ఛ ఉన్నప్పుడు ప్రవేశాల కోసం విద్యార్థులు పోటీపడే వారని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి అశోక్, యూనివర్సిటీ నాయకులు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, ఏఐఎస్ఏ నాయకులు మనోజ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాణిక్యం అధ్యక్షత వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మునెప్ప మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికుల సమస్యలన్నీటిని పరిష్కరిస్తామని చెప్పి నేటి వరకు పరిష్కరించలేదన్నారు. క్యాబినెట్ సమావేశంలో ఆప్కాస్‌ను. రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆప్కాస్ రద్దు చేయవలసివస్తే మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లింపు బాధ్యత స్థానిక మున్సిపల్ అధికారులే చెల్లించాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీ కంపెనీలకు అప్పజెప్పరాదన్నారు. అవుట్సోర్సింగ్ కార్మికుల కనీస వేతనం రూ.36వేలు చెల్లించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు మూడు సంవత్సరముల పెండింగ్ సరెండర్ లీవ్ డబ్బులు. విడుదల చేయాలన్నారు. కార్మికులకు పనిముట్లు సకాలంలో ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. కొబ్బరి నూనె. సబ్బులు ఇంఫార్మ్ బట్టలను తక్షణమే ఇవ్వాలి అన్నారు. ఆడపిల్లలతో ఆనందంగా గడపడానికి ఆదివారం రోజున పూర్తి సెలవులు ఇవ్వాలన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేయడం జరుగుతుందని అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగరకార్యదర్శి జీ చంద్రశేఖర్, ఆటోవర్కర్స్‌యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, ఏఐటీయూసీ డిప్యూటి కార్యదర్శి రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ క్రిష్ణారెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ నాయకులు అయ్యరాజు, స్వాములు, జయరాముడు, మల్లి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమిజాబీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నగర కార్యదర్శి అశోక్, భవననిర్మాణ సంఘం కార్మికులు ఇర్మియా, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గణేష్, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యా.. హత్యా..

విశాలాంధ్ర - నందవరం: నందవరం గ్రామానికి చెందిన కె.ఆశీర్వాద (26) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అదే గ్రామానికే చెందిన మధుతో గతం రెండేళ్ల కిందట వివాహం అయ్యింది. భార్య, భర్తలు తరుచు గొడవలు పడే వారని కాలనీ వాసులు అంటున్నారు. శుక్రవారం రాత్రి సైతం గొడవ జరిందని, ఉదయం చూసేలోపు ఆశీర్వాద ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఆశీర్వాద ఉరి వేసుకున్న తీరు పలు అనుమానాలకు వ్యక్తం అవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. అమ్మాయి సహజంగానే తనంతటా తానే ఉరి వేసుకుందా.. లేదా చంపి ఉరి వేశారా.. అని తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ స్కూల్‌కు పరీక్ష

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: గిరిజన సంక్షేమ శాఖా వారి ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో 2025-26లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబందించిన ఎంట్రన్స్ టెస్ట్ ఈ నెల రెండో తేదీన ఆదివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమం అధికారి తులసి దేవి శనివారం ఓ ప్రకటన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న గిరిజన బాల, బాలికలు తప్పని సరిగా హాల్ టికెట్‌తో వారికి నిర్దేశించిన పరీక్ష సెంటర్ నందు హాజరు కావాలన్నారు.

ఆగవేళిలో పెద్ద దేవర మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని ఆగవేలి గ్రామంలో వెలసిన పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ దేవతల పెద్ద దేవర వేడుకల మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ నెల 4న మంగళవారం సుంకులమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, కర్రెమ్మ దేవతలకు 7 గంటలకు పూజ, నైవేద్య సమర్పిత కార్యక్రమం ఉంటుందన్నారు. 5శ్రీ బుధవారం అమ్మవార్లకు బోనాల సమర్పిత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. పెద్ద దేవర అనగా గ్రామ పోలీమారులో పోలికేకతో గొర్రె పిల్లలను బలిస్తూ గ్రామం చుట్టూరు తిరుగుతారన్నారు. అనంతరం గ్రామదేవతలకు పోతులను బలి ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. గ్రామంలో పెద్ద దేవర చేయడంతో గ్రామ ప్రజలు సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ధన, ధాన్యాలతో ఉండాలని పాడిపంటలు అభివృద్ధి చెందుతాయని నమ్మకంతో పెద్ద దేవర నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సమస్త బంధుమిత్రులు భక్తులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని పెద్దదేవర మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. పెద్ద దేవర సందర్భంగా రాంపల్లె శీను చెక్కభజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఇంటర్‌లో 11 విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 611 విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయని ఆర్ఐఓ గురువయ్య శెట్టి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 23,755 గాను 23144 పరీక్షలకు హాజరు అయ్యారు. ఎలాంటి మాస్ కాపీకి పాల్పడకుండా ప్రత్యేకమైన చర్యలు చేపట్టమన్నారు. 611 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కాలేకపోయారు వారు తెలిపారు.

బడ్జెట్ హామీల అమలుకి మార్గ నిర్దేశం

విశాలాంధ్ర-పత్తికొండ: కూటమి ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ హామీల అమలుకు మార్గ నిర్దేశనం చేసేలా ఉందని జనసేన నియోజకవర్గ సమన్వయ బాధ్యుడు సీజీ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ఉందని, అందుకు అనుగుణంగా కేటాయింపులు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి తీరుతుందన్నారు.

అట్టహాసంగా గజ్జలగుండు ఎత్తు పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - పెద్దకడబూరు: పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సిద్ధరూఢస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో శనివారం గజ్జల గుండు ఎత్తు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్, బూత్ కమిటీ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రఘురామ్ గజ్జల గుండు ఎత్తు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో కర్ణాటకలోని బీజాపూర్ తాలూకా ఎర్రవెల్లి గ్రామానికి చెందిన దశరథ్ రెండు క్వింటాళ్లు, 185 కేజీలు, 178 కేజీలు, 150 కేజీల గజ్జల గుండు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచారు. కర్నాటకలోని మాన్వి తాలుకా గప్పగల్ గ్రామానికి చెందిన కర్ణ కేవలం 150 కేజీల గజ్జల గుండు ఎత్తి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బ్రహ్మయ్య, మొట్రు దస్తగిరి, రామాంజనేయులు, శాంతిరాజు, గంగులపాడు రమేష్, కోరి లింగన్న, కంబళదిన్నె మారెన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పు)లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరా శాంతి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులు క్లస్టర్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో 1971 నుండి చదివిన పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని కళాశాల సమస్యల పరిష్కారంలో తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధికి ఎల్లవేళలా చేయూతనందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఆర్థికంగా, వస్తు రూపకంగా, సలహా రూపకంగా మరే రకంగా అయినా సరే తోడ్పాటును అందించి, సహకరించాలని కోరారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య డీవీఆర్ సాయి గోపాల్ మాట్లాడుతూ, క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన రూసా భవనాలకు, కళాశాల ప్రముఖ వ్యవస్థాపక సభ్యులైన, ముఖ్య దాత పేలాల కొండయ్య గారి పేరును, మహిళా హాస్టల్ కు వారి సతీమణి పేరును పెడతామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థుల కమిటీ కన్వీనర్ డా.కె.జి.మల్లికార్జున, పూర్వ విద్యార్థులు పేలాల ప్రేమ్ కుమార్, శివశంకర్ రెడ్డి, డా.మన్సూర్ రహమాన్, వైస్ ప్రిన్సిపాల్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, డా.మోహన మురళీ, రమణా రెడ్డిలు పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీ జనరల్ సర్జరీ పీజీ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విజయవాడ ఆధ్వర్యంలో గత డిసెంబర్, జనవరి మాసాలలో జరిగిన పీజీ వైద్య విద్యార్థుల పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్ష ఫలితాలలో కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్ష ఫలితాలలో టాపర్స్‌గా డాక్టర్ డి.విష్ణు శ్రీకర్ రెడ్డి 800 మార్కులకు గాను 613 మార్కులు, డాక్టర్ ఎ.తేజేశ్వర్ రెడ్డి 800 మార్కులకు 610 మార్కులు, డాక్టర్ పి.వెంకట శివ నాగజ్యోతి 800 మార్కులకు గాను 602 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం కర్నూలు మెడికల్ కళాశాల టాపర్‌లను హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి, నరసమ్మ అభినందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపర్ ఇంటెండెంట్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొదటి మూడు ర్యాంకులు సాధించిన పీజీ విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించిన తర్వాత పేద ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ముఖ్యంగా చదివిన కాలేజీని, విద్య నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోకుండా ఉన్నతమైన ఎత్తు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తర్వాత కాలేజ్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ఒకే కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మొదటి మూడు ర్యాంకులు సాధించడం రికార్డు అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ బి.హరిచరణ్, ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్, డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ మాధవి శ్యామల, డాక్టర్ జయరాం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయ్, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విరిగిపడిన కొమ్మ ఘటనపై ప్రత్యేక అధికారి

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్టు కొమ్మ విరిగి బాలిక పైపడి, గాయాలైన ఘటనపై మండల ప్రత్యేక అధికారి శ్యామలమ్మ ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి శనివారం ఆరా తీశారు. శని వారం హెచ్ఎం రమాదేవి ఉపాధ్యా యులు జరిగిన ఘటనపై వివరిస్తూ సైన్స్ డే సందర్భంగా చెట్టు కింద ఏర్పాటు చేసినట్లు అధికారులతో అన్నారు. అనుకోకుండా గాలులు రావడంతోనే ఆ చెట్టు ఒక్కసారిగా విరిగి కొమ్మలు విద్యార్థినీలపై పడ్డాయని, ప్రాణప్రాయమేమి లేదని, విచారణలో అధికారులకు చెప్పారు. చెట్టును తొలగించి ప్రమాదకర వృక్షాలను వారు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించి, అందుకు ఉపాధ్యాయులు పాటు పడాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనం లోని నాణ్యతను తనిఖీ చేసి సహ పంక్తి భోజనం చేసి, నాణ్యతలో మెలకువలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : నగరంలోని సంతోష్ నగర్‌లో ఉన్న ఉమ మాధవ స్కూలులో సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు వివిధ నమూనాలు ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ మాధవకృష్ణ ప్రారంభించారు. సీవీ. రామన్ పుట్టినరోజు సందర్భంగా సైన్స్ డేను నిర్వహించారు. ఈకార్యక్రమంలో నీటి నుంచి విద్యుత్ ఎలా తయారు చేస్తారు, కుంభమేళా ప్రత్యేకత, శరీర అవయవాలు వాటి పనితీరు, రక్త పరీక్షలు తదితర అంశాలను విద్యార్థులు సైన్స్ ఫైర్‌ను చూసేందుకు వచ్చిన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవకృష్ణ, ఉపాధ్యాయులు చంద్ర, సుభాషిణి పాల్గొన్నారు.

ఘనంగా ప్రెసర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీకాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీకాలేజ్‌లో ఫ్రెషర్స్ డే నిర్వహించుకున్నారు. ముఖ్య అధితిగా కళాశాల చైర్మన్ అన్నదాత డాక్టర్ కె.వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి డిసిప్లిన్ కలిగి ఉండాలని కష్టపడి చదివి టైం వృధా చేసుకోకుండా ప్రతి రోజు కాలేజీకి వచ్చి చదువుకోవాలని చెప్పడం జరిగింది. కరెస్పాండెంట్ ఎస్.విజయలక్ష్మమ్మ మాట్లాడుతూ కష్టపడి చదివి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెడు సావాసాలు చేయకుండా మంచిగా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డ్ కార్పొరేటర్ కె.పద్మలత రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రమణ, బీ ఫార్మసీ హెచ్ఓడీ ఎండీ నిజాముద్దీన్ ఫార్మా-డీ హెచ్ఓడీ ఎం.శ్రీరామచంద్ర, ఫ్యాకల్టీ మెంబర్స్ ద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా ఎస్ఎల్‌సీ సైన్స్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కేవీఆర్ గార్డెన్స్ కేవీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌సీ (స్టూడెంట్ లిడ్ కాన్ఫరెన్స్) సైన్స్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ప్రయోగత్మాకంగా తయారు చేసిన సైన్స్ పరికరాలను, అన్ని సబ్జెక్ట్స్ వారిగా ఈ సైన్స్ ప్రోగ్రాంలో ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కర్నూలు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యల జిల్లా అధ్యక్షులు, వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ యుగంధర్,సిరాక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇబ్రహీం,అపుస్మా కార్యదర్శి షాహీధ, కేవీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ సాధు శ్రీనివాస రెడ్డి,లీడ్ జిల్లా ఇంచార్జ్ ముజామిళ్ తదితరులు విచ్చేసి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగత్మక సైన్స్ పరికరాలను సందర్శించడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున సైన్స్ ప్రతిభను వెలికి తీయడానికి, వారిలో నూతన ఉత్సహాని పెంపోందించడానికి, విద్యార్థుల్లో చదువు పట్ల శ్రద్ధ పెంచడానికి ఇలాంటి సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయని తెలియజేయండి జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినీని పరామర్శించిన జిల్లా కలెక్టర్..

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : సి.బెళగల్ మండలంలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖ మీద చెట్టు విరిగి పడడంతో గాయాలై ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 6 గంటలకు ఆసుపత్రికి వెళ్లి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యార్థిని పరామర్శించారు. పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్కూలు ఆవరణంలో మీటింగ్ జరుగుతుండగా హఠాత్తుగా పక్కన ఉన్న చెట్టు కూలి విద్యార్థుల మీద పడడంతో 8వ తరగతి చదువుతున్న శ్రీలేఖ అనే విద్యార్థినికి నడుముకు గాయాలు కాగా, మరో 6 మందికి చిన్నపాటి గాయాలయ్యాయి. నడుముకు దెబ్బ తగిలిన విద్యార్థినిని అంబులెన్స్ లో గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించి, అక్కడ ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న విద్యార్థినిని పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్య సేవలు అందచేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులను ఆదేశించారు. తల్లిదండ్రులతో మాట్లాడి, ఆందోళన చెందవద్దని, విద్యార్థినికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సంబంధిత విభాగాల వైద్యులు ఉన్నారు.

ఖరీదైన వైద్యం

వైద్యం పేరుతో ఘరానా దోపిడి
ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వ వైద్యశాలలు
ప్రాణం పోయినా... వైద్యం చేస్తున్న ప్రైవేట్, కార్పోరేట్ వైద్యశాలలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: మనిషి ప్రాణం చాలా విలువైంది. అనారోగ్యంతో కార్పొరేట్ వైద్యశాలలకు వెళితే వైద్యశాలలో పరీక్షల పేరుతో వేలరూపాయలు వసూలు చేస్తూ, అవసరం లేకున్నా పరీక్షలు చేస్తూ డబ్బులు గుంజుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ వైద్యశాలకు వెళ్ళాలంటే రోగి పై ప్రాణాలు పైపైనే పోయో పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ప్రభుత్వ వైద్యశాలలో ఉన్నతమైన వైద్యం లభిస్తుంది. కాని సకాంలో వైద్యం అంది ంచడంలో కొంత నిర్లక్ష్యం జరుగుతున్నదన్న ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు మూడు రాష్ట్రాల నుండి రోగులు ఇక్కడకు వస్తారు. నిత్యం సుమారు 2 వేలకు పైగా ఓపీ రావడం జరుగుతుంది. ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యశాలలో ఉన్నటు వంటి పరికరాలు అంతగా లేకపోయినా వైద్యం అందించేందుకు మంచి వైద్యులు ఉన్నారు. కాని సకాలంలో వైద్యం అందించడంలో కారాణాలు ఏవైనా కొంత నిర్లక్ష్యం ఉన్నదన్న ప్రచారం ఉంది. కానీ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం పేరుతో లక్షల రూపాయలు దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కర్నూలు నగరంలోని ప్రైవేట్ వైద్యశాలలో తెలంగాణాకు చెందిన ఒక యువతి అనారోగ్యంతో వైద్యశాలకు వస్తే వైద్యశాలలో లక్షల రూపాయలు తీసుకుని సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో వైద్యశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు కొంతడబ్బు ఇచ్చి సర్దుబాటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇలాగే నగరంలోని మరో కార్పొరేట్ వైద్యశాలలో ఇటీవల దేవనకొండ మండలంకు చెందిన ఒక మహిళ అనారోగ్యంతో వైద్యశాలలో చేరితే ఆరోగ్యశ్రీ నుండి డబ్బులు తీసుకోవడమే కాకుండా రోగి కుటుంబ సభ్యుల నుండి కూడా కొంత డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. చివరకు ఆ మహిళ సాయంత్రం మృతి చెందితే కుటుంబ సభ్యులకు తెలియచేయకుండా వైద్యం చేసినట్లు తెలుస్తుంది. కుటుంబ సభ్యులు అనుమానంతో నిలదీస్తే అర్థరాత్రి రెండు గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు అందోళనకు దిగితే వారికి కొంత డబ్బును ఇచ్చి సర్దుబాటు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఇలా కొన్ని వైద్యశాలలో రోగుల నుండి అవసరం లేకున్నా టెస్టుల పేరుతో డబ్బులు వసూలుచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వైద్యశాలకు చెందిన మందుల షాపులకు మందులు రాస్తూ అధిక డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. బయట మార్కెట్‌లో ధరల కంటే ఎక్కువ ధరలు వేస్తూ జేబులు ఖాళీ చేస్తున్నారు. అత్యధిక కార్పొరేట్ వైద్యశాలలు గ్రామాలలో ఫస్ట్ ఎయిడ్ చేస్తున్న ఆర్ఎంపీ డాక్టర్‌ల సహాయంతోనే నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎంపీలకు గిఫ్టులు, వారికి కమీషన్‌లు ఇస్తూ రోగులను తమ వద్దకు తీసుకు వచ్చే విధంగా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వైద్యం పేరుతో దోచుకుంటున్న కార్పొరేట్ వైద్యశాలలోపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు చేసి రోగుల వైద్యం సక్రంగా అందేలా చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ వైద్యశాలలు ఇష్టాను సారంగా దోచుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రోడ్ల మరమ్మత్తులకు సహకరించండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండలంలోని బైచిగేరి క్రాస్ రోడ్డు నుండి పెద్దకడబూరు వరకు గల రహదా రికి మరమ్మతులు చేపట్టాలని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు నరవ శశిరేఖ దంపతులు రాష్ట్ర మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కోరారు. మంత్రాల యంలోని శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన శనివారం పెద్దకడబూరుకు చెందిన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలపల్లి నుండి ఎమ్మిగనూరు వరకు రహదారి మరమ్మత్తులు చేయించాలని కోరారు. పెద్ద కడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీకి అనుమతి ఇవ్వాలని, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని హనుమాపురంలో పేదలు వేసు కున్న కొట్టాలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సచివాలయం, రైతు సేవా కేంద్రాల భవనాలను పూర్తి చేయాలని వినతిపత్రంలో వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

విశాలాంధ్ర - కర్నూలు : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని రాయలసీమ మహిళా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శకుంతల రాయల సీమ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవం పురస్కరించుకుని కర్నూలు డీఎస్పీ, ఐసీడీఎస్ పీడీ, డీసీపీవో, వన్ స్టాప్ సెంటర్ వాళ్లు, ఎన్జీవోలు, మెప్మా ప్రతినిధులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాయలసీమ మహిళా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శకుంతల మహిళలు అన్ని రంగాలలోనూ ముందుండాలన్నారు. మహిళలు తమ శక్తి సామర్థ్యాలతో చాలామంది వారి, వారి స్వశక్తితో అభివృద్ధి చెందుతు న్నారన్నారు. ఈ వారోత్సవాలలో మహిళలకు,అమ్మాయిలకు అవగా హన కల్పించాలన్నారు. బాలికను బతకనిద్దాం ,చదవనిద్దాం, రేపటి మహిళగా అభివృద్ధి చెందనిద్దామన్నారు. కర్తవ్యంలో మహిళా ప్రాధాన్యం, దేశ అభివృద్ధికి ప్రభావం. మహిళలను గౌరవిద్దాం. మహిళల శక్తికి తొలి అడుగు, సభలలో ఉద్యోగ కొలువు, అవనిలో సగభాగం మహిళలే అనే నినాదాలు చేస్తూ ముందుకు పోవాలన్నారు. ర్యాలీ కలెక్టర్ ఆఫీస్ నుండి గౌరీ గోపాల్ హాస్పిటల్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, మెప్మా అధికారులు,ఎన్జీవో ప్రతినిధులు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - వెల్దుర్తి: మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు పూల మాలల వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మార్పీయస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు నాయకంటి గిడ్డయ్య మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో మాదిగ జాతి భవిష్యత్తు కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరులను మాదిగ జాతి ఎప్పుడు మర్చిపోదని వారి ఆశయాలను కొనసాగిస్తామని, అమరవీరుల త్యాగాలు వృధా కానివ్వం వారి త్యాగా లను స్మరించుకుంటామనన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలోనే మాదిగ జాతికి భవిష్యత్తు అన్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసపోగు బజార్ మాదిగ, జగ్గుల బజార్ మాదిగ, దేవదానం మాదిగ, వెంకట నారా యణ మాదిగ, సురేష్ మాదిగ, రాజేష్ మాదిగ, విజయ్ మాదిగ, మనోరాజు, నారాయణ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అహోబిలం చేరుకున్న 46వ పీఠాధిపతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అహోబిలం 46వ పీఠాధిపతి శ్రీవన్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శనివారం అహోబిలం చేరుకున్నారు. మార్చి 4 నుండి అహోబిలం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన శిష్య పరివారంతో అహోబిలం చేరుకున్నారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ బృందం ఆలయ సాంప్రదాయాన్ని అనుసరించి పీఠాధిపతి వారికి పూర్ణకుంభం స్వాగతం పలికి స్వామివారి మాల, గంధం, పరివటంతో సత్కరించారు. అనంతరం నూతన గరుడ విగ్రహాన్ని ఆవిష్కరించి అహోబిలం పీఠాధిపతి పూజ చేశారు. ఈ గరుడ విగ్రహాన్ని ఆళ్లగడ్డకు చెందిన యోగా టీచర్ ఎర్రం వెంకటాద్రి, భాగ్యలక్ష్మి దంపతుల సహకారంతో ఏర్పాటు చేశారు. వారిని పీఠాధిపతి పట్టు వస్త్రంతో, గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అహోబిలం ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, జనరల్ మేనేజర్ మురళి ధరన్, మనీయార్ లు సౌమ్య నారాయణ, సుదర్శన్, వైకుంఠం, అర్చకులు మధుసూదన్, డీఈఈ రవికాంత్ చౌదరిలు పాల్గొన్నారు.

ముస్లింలకు పవిత్ర మాసం.. రంజాన్ మాసం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ముస్లింలకు పవిత్రమైన మాసం. రంజాన్ మాసం. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. అలాంటి రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. సౌదీ, అరబ్ దేశాలలో రంజాన్ మాసం శనివారం నుంచి ప్రారంభమైంది. దీంతో మత పెద్దలు భారతదేశంలో ఆదివారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం అవుతుందని ప్రకటించారు. దీంతో శనివారం రాత్రి మసీదులలో 'తరావి నమాజు' ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈనెలలోనే ముస్లింలకు పవిత్రమైన దివ్యఖురాన్ ఆవిర్భవించింది. ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఉపవాసదీక్షలు (రోజా) ఆచరించాలి. రంజాన్ నెల ప్రారంభం నుంచి ముగిసే వరకు నిష్ఠగా ఉపవాసదీక్ష పాటించాలి. సహరి అనగా ఉదయం సూర్యాస్తమయం కంటే ముందు ప్రారంభమై సాయంత్రం సూర్యాస్తమయంతో ఇఫ్తార్ తో ఉపవాసం పూర్తవుతుంది. రోజుకు 13-14 గంటల ఉపవాసంలో ముస్లింలు మంచి నీళ్లు కూడా తాగరు. చెడు సావాసాలకు దూరంగా ఉంటారు. ఐదు పూట్ల నమాజులు ఆచరిస్తారు. అలాగే ఖురాన్ పారాయణంతో గడుపుతారు. రంజాన్ నెలలో చేసే ప్రతి పుణ్య కార్యక్రమానికి 70 రెట్లు అధికంగా ప్రతిఫలం లభిస్తుందని ముస్లిం సోదరులు నమ్మకం. ఈనెలలో ప్రతి ముస్లింలు తమ స్థోమతను బట్టి దానధర్మాలు చేస్తారు. రంజాన్ నెలను మూడు భాగాలుగా చేశారు. ఇందులో మొదటి పది రోజులు అల్లాహ్ అనుగ్రహం, రెండో పదిరోజులు పాప క్షమాపన కోరేందుకు, మూడో పదిరోజులు నరకాగ్ని నుండి విముక్తి ప్రసాదించమని కోరుకోవడం. ఈ మాసంలోనే జకాత్, ఫిత్రా ను ముస్లింలు ఆచరిస్తారు. తమ ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అంటారు. పేదవారు కూడా అందరితోపాటు పండుగను సంతోషంగా జరుపుకోవడానికి ఈ 'జకాత్' ఉపయోగపడుతుంది. రంజాన్ మాసంలో ఆచరించే మరో విధి ఫిత్రాదానం. మూడు పూటలా తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకుని పేదవారు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటి అభాగ్యులకు పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం ధర్మం ఉద్బోధిస్తుంది. దీనినే ఫిత్ర దానము అని పిలుస్తారు. కుటుంబంలో ఎంత మంది ఉంటే వారందరూ ఫిత్రా ను ఆచరించాలి. రంజాన్ నెలలో చివరి శుక్రవారం జుమ్మతుల్ విధ అంటారు.

తరావీహ్ ప్రార్థనలు: రంజాన్ నెలలో తరావీహ్ నమాజులు చదువుతారు. దివ్య ఖురాన్లోని ముప్పై అధ్యాయాలను తరావీహ్ నమాజ్లో రోజుకు ఒకటి చొప్పున చదువుతారు. 30 రోజుల్లో ఖురాన్ పారాయణం పూర్తి చేస్తారు.

ఏతేకాఫ్: రంజాన్ నెల 21వ రోజు నుంచి చివరి వరకు ఒకేరకమైన తపోనిష్టతో దైవధ్యానం, పవిత్ర ఖురాన్ పారాయణం చేయడంలో నిమగ్నులవుతారు. ఏతేకాఫ్ లో ఉన్నవారు బలమైన కారణం ఉంటే తప్ప బయటకి రారు.

షబ్-ఎ-ఖద్ర్ (బడేరాత్): రంజాన్ నెలలో పవిత్రమైన షబ్-ఏ-ఖదర్ రాత్రి వస్తుంది. చివరి ఐదు బేసి రాత్రుల్లో (21, 23, 25, 27,29) ఒక రాత్రి లైలతుల్ ఖదర్ అయితే 27వ రాత్రి లైలతుల్ ఖద్ర్ కావడానికి ఎక్కువ అవకాశం ఉందని ముస్లిం సోదరులు నమ్ముతారు. అందుకే ఆరోజు రాత్రంతా దైవ ప్రార్థనలో గడుపుతారు.

ఈద్ ఉల్ ఫితర్: నెల పొడుపుతో రంజాన్ ఉపవాస దీక్షలు విరమించి మరుసటి దినాన్ని ఈద్-ఉల్-ఫితర్ పండగగా నిర్ణయిస్తారు. ప్రతి ఒక్కరు కొత్త బట్టలు ధరించి పండగ నమాజును ఈద్గాలలో చేస్తారు. ప్రార్థనల అనంతరం

రజక సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం మహానంది నందు జరుపబడుచున్నది. మహా శివరాత్రి సందర్భంగా మహానందిలో రజక సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫిబ్రవరి 26 బుధవారం నుండి. 28వ తేదీ శుక్రవారం వరకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఈశ్వర రజక అన్నదాన సేవా సమితి అధ్యక్షులు కే. నాగరాజు తెలిపారు. 2009 సంవత్సరం నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సహరించిన రజక సోదరీ సోదరీమణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నెల చివరి నాటికి గృహాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - చాగలమర్రి: ఈ నెల చివరి నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ హరి గోపాల్ కోరారు. చాగలమర్రి పట్టణంలోని కూలూరు రస్తాలోని ప్రభుత్వ లేఔట్లలో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులకు నిర్మాణాలను పూర్తి చేయాలని అవగాహన కల్పించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పీఎంఏవై కింద 59,255 గృహాలు మంజూరు కాక ఇప్పటి దాకా 30126 గృహాలు పూర్తయ్యాయని మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. జిల్లాలో 4772 గృహాలు ఈనెల చివరిగా పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం టార్గెట్ ఇచ్చిందన్నారు. బేస్ మట్టం వరకు గల నిర్మాణాలు కూడా త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగదని ఆయన తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ నరసింహారావు, వర్కు ఇన్స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగు సహాయకులు కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

75 కుటుంబాలు బీజేపీలో చేరిక

విశాలాంధ్ర - ఆదోని క్రైం: నియోజవర్గ పరిధి లోని ధనాపురం, చిన్న పెండేకల్లు, గుణభవి గ్రామాలకు చెందిన 75 కుటుంబాలు వైసీపీ నుండి బిజెపిలో చేరడం జరిగిందని బీజేపీ నాయకుడు మధుసూదన్ శర్మ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో హైదరాబాదులోని కార్యాలయంలో పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటయిన పర్వతం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షించి, ఆదోని అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి సాధ్యమని తెలిసి పార్టీలోకి చేరుతున్న ప్రతి ఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ధనాపురం సర్పంచ్ చంద్రశేఖర్, చిన్న పెండేకల్ చిలుక జయరాం, గోనభావి మాజీ ఎంపీటీసీ గోవిందు, పార్టీ నాయకులు కల్లుపోతుల సురేష్, రంగన్న యాదవ్, రంగస్వామి, విశ్వనాథ్, రాముడు పాల్గొన్నారు.

ముగిసిన యాగంటి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో గత నెల 25 నుంచి నుండి శనివారం వరకు అత్యంత వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సాయంత్రం ధ్వజాఅవరోహణతో ముగిశాయి. వరుసగా ఐదు రోజులపాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీ ఉమామహేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశం మేరకు భక్తుల కోసం ఆలయ ఈవో బి చంద్రుడు,యాగంటిపల్లె ఉప సర్పంచ్ బండి చంద్రమౌళి రెడ్డిలు ఆలయ సిబ్బంది భక్తులకు సౌకర్యాలు కలిగించారు. ఉదయం యాగంటి శివదీక్ష విరమణ అనంతరం ఆలయ సిబ్బంది ,అర్చకస్వాముల ఆధ్వర్యంలో నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం ధ్వజా అవరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి.

ఆళ్లగడ్డలో రీచ్ ఉన్నా ఇసుక దొరకటం లేదు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేసినప్పటికీ ఇసుక దొరకడం లేదని ఆళ్లగడ్డ తాలూకా వైసిపి నాయకులు భూమా కిషోర్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణంలో విలేకరులతో మాట్లాడుతూ ఒకవేళ బయట నుంచి తెప్పించుకున్న ట్రాక్టర్లను, లారీలను పోలీసులు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఇసుక రీచ్ ఉన్నప్పటికీ ఇసుక ఎక్కడికి పోతుందన్నారు. ఇసుక డంప్ అవుతున్నప్పటికీ ఇసుక ఎక్కడికి పోతుందో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. ఆ విషయమై తహసిల్దార్తో మాట్లాడుదాం అని వచ్చానని ఆమె అందుబాటులో లేదన్నారు. ఇసుక దొరకక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి హయాంలో ఇసుక కొరత ఉందని టిడిపి నాయకులు గగ్గోలు పెట్టారన్నారు. ఇప్పుడు వారి ప్రభుత్వం వచ్చి 9నెలలు అయిందని ఇసుక ఫ్రీగా దొరకడం లేదన్నారు. ఇసుక దొరకక పోవడంతో గృహ నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. అధికారులు ఇసుక విషయంలో చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వం 9 నెలలు అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో మూడు రోజుల క్రితం బడ్జెట్ కేటాయింపులు ప్రవేశపెట్టారన్నారు. ఆ బడ్జెట్ నిరాశజనకంగా ఉందన్నారు. నంద్యాల జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ బడ్జెట్లో నిధులు ఇవ్వలేదన్నారు. జిల్లాలోని ఏ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకోరా బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఊసేలేదన్నారు. అన్ని సంక్షేమ పథకాలను కుదిస్తున్నారన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా గురించి మాట్లాడితే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జర్మనీకి వెళ్ళండి అంటున్నారు. ఆయనకు మతి ఉండి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. బిజెపి నాయకులు సుబ్రహ్మణ్యస్వామి వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కుతుందని చెబుతున్నారన్నారు. ఆనాడు ఢిల్లీలో బిజెపికి మూడు సీట్లు గెలిచిన ప్రతిపక్ష హోదా ఇచ్చారని 11 సీట్లు గెలిచిన వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మున్సిపాలిటీలో ఒక్క పని కూడా జరగలేదని మంజూరైన రోడ్లు ఆపివేశారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు అంబటి మహేశ్వర రెడ్డి, నాగిరెడ్డి పల్లె శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం

విశాలాంధ్ర - డోన్ రూరల్ : స్థానిక యమ్మార్పీయస్ కార్యాలయంలో శనివారం రోజు మాదిగ అమర వీరుల దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అమరులైన మాదిగ అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలల వేసి వారికి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో గుండాల ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో మాదిగ జాతి భవిష్యత్తు కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరులను మాదిగ జాతి ఎప్పుడు మరచి పోదని వారి ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. అమరవీరుల త్యాగాలు వృధా కానివ్వం వారి త్యాగాలను స్మరించు కుంటామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థా పకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలోనే మాదిగ జాతికి భవిష్యత్తు అని పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రెండు రాష్ట్రాల రాజధానులు అయిన హైదరాబాదు అమరావతి పట్టణాలలో స్తూపం నిర్మించి, ఐదు ఎకరముల స్థలంలో మ్యూజియంలో నిర్మించాలని కోరారు. మాదిగ అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరిగేలా, వారికి అండగా ఉండేలా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలు గా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు ఒకటి 2024న ఎస్సీ వర్గీకరణ సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో మాదిగల చిరకాల ఆకాంక్ష, అమరవీరుల త్యాగాలు వారి ఆశించిన ఆశయం, కలలు సాకారం అయిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పులి కేశవయ్య, మాదిగ యమ్మస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి,, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చినరాయుడు, మాదిగ సీనియర్ నాయకులు కొసనపల్లి రామాంజనేయులు, మాదిగ, యమ్మస్పీ మండల నాయకులు పులి పెద్దయ్య మాదిగ, పులి బాలకేశవులు మాదిగ, గుండ్లకొండ రంగన్న మాదిగ,జె రాము మాదిగ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగేశ్వరరావు మాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం నందు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ఉద్యోగ రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో పూర్తిగా వెనుకబడిన మాదిగలు, ఉప కులాలు అభివృద్ధి, ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో గూటం మారెన్న మాదిగ, బాల దస్తగిరి, నాగ పుల్లయ్య, సురేష్, రామప్ప, నాగన్న, బాల ఓబులేష్,శ్రీనివాసులు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగమే ఎస్సీ వర్గీకరణ

విశాలాంధ్ర - బనగాన పల్లె : మాదిగ అమర వీరుల త్యాగాల ఫలితం గానే సుప్రీం కోర్ట్ ద్వారా విజయం సాధించిందని ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షులు శివ నారాయణ మాదిగ తెలిపారు. మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ఎస్సీ హాస్టల్లో ఎంఎస్పి ఎమ్మార్పీ మండల కమిటీ ల ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శివ నారాయణ మాదిగ హాజరై మాట్లాడుతూ ఆధునిక భారతదేశ చరిత్ర లో స్వాతంత్రోద్యమం తర్వాత 30 ఏళ్ల సుదీర్ఘమైన శాంతిన్విత ఉద్యమాన్ని నడిపి విజయం సాధించిన చరిత్ర మంద కృష్ణ మాదిగ నాయకత్వం లో ఒక్క ఎమ్మార్పీఎస్ కే సాధ్యమైందని అన్నారు. ఎంఎస్పి మండల అధ్యక్షులు శ్రీను మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మహేష్ మాదిగ ఎం ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు మనోహర్ మాదిగ ఎమ్మార్పీఎస్ హరి రామకృష్ణ హరిచంద్ర పాల్గొన్నారు.

99 శాతం పింఛన్‌లు ఒకటో తేదీనే విజయంతంగా అందజేస్తున్నాం : మంత్రి

విశాలాంధ్ర - బనగానపల్లె : 9 నెలలుగా 99 శాతం పింఛన్లు ఒకటవ తేదీన ఇంటి వద్దనే విజయవంతంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందివర్గం గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందివర్గంలో పింఛన్ లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే ఫించన్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క బనగానపల్లెలో మండలంలోనే దాదాపు రూ.5.35 కోట్లు ఫించన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ ను విజయవంతంగా అమలు చేస్తూ ఫించన్ రూ.4 వేలకు పెంచడం జరిగిందన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదన్నారు. ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నందివర్గం గ్రామం చేరుకోగానే మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు నాయకత్వంలో టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, ఏడీ మారుతి సకారం, పంచాయతీ సెక్రెటరీ గ్రూప్ ప్రసాద్ సచివాలయ సిబ్బంది, ఉప సర్పంచ్ ఉమామహేశ్వరరావు, మురళి మోహన్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సంజీవ కృష్ణుడు, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను శనివారం తహశీల్దార్ పవన్ కుమార్ రెడ్డి పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి అందులో భాగంగానే ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సాంస్క్రిట్ పరీక్ష పేపర్లు శనివారం నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేశారా లేదా అన్న విషయంపై తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో249 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో 203 విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 5 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు అయినట్లు సూపరింటెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెంట్ రామలింగారెడ్డి, మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలను ప్రారంభించిన ఎన్ఎండీ ఫయాజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మహాశివరాత్రి సందర్భంగా మహా నంది పుణ్యక్షేత్రం నందు 3వ రోజు నిర్వహించిన అఖిల భారత ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ ఈ ఎద్దుల పోటీలు కేవలం సంప్రదాయ క్రీడ మాత్రమే కాకుండా, రైతులకు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడంతో పాటు, ఈ పోటీలు వ్యవ సాయాన్ని, ఆరోగ్యవంతమైన పశుపోషణను, రైతుల ఆసక్తిని పెంపొం దించేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు బన్నూరు రామలింగారెడ్డి, కొట్టాల శివ నాగిరెడ్డి, అడ్వకేట్ మిట్నాల రాజేశ్వర్ రెడ్డి, కొట్టాల రాజేష్, అడ్వకేట్ ప్రసాద్, ఖలీల్, ఆర్యవైశ్య సంఘం నాయకులు గంగిశెట్టి రాజేష్, అశోక్, తాటికొండ బుగ్గ రాముడు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, భక్తులు, రైతులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో రిజిస్ట్రేషన్ పనుల కొరకు వచ్చే ప్రజల కోసం ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం నూతనంగా పార్కు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ సి. హెచ్ జానకి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించి ప్రాంగణం చుట్టూ నూతనంగా మొక్కలు నాటారు. జానకి దేవి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ పనుల కొరకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ పార్కు ఎంతో ఉపయోగపడుతుందని, త్వరలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మిస్తామని అన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని బిజినివేముల గ్రామంలో శనివారం భక్తుల కొంగు బంగారం అయినా శ్రీశ్రీశ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామిని శనివారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య దర్శించుకున్నారు. ముందుగా గ్రామ సర్పంచ్ రవి యాదవ్ ఆధ్వర్యంలో భాజా భజంత్రీల మధ్య పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ పూలమాలవేసి దృశ్యాలువతో సన్మానించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్వెల్ డే

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల స్థానిక నడిగడ్డలోని మాస్టర్ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ పర్ల హలీమా ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్వెల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ బాబన్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, వాసవి స్కూల్ కరస్పాండెంట్ దస్తగిరి, స్కూల్ డైరెక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ పర్ల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫయాజ్, డాక్టర్ బాబన్ మాట్లాడుతూ మార్కుల ప్రతిపాదికగా కాకుండా క్రమశిక్షణ నైతిక విలువలతో అద్భుతమైన భవిష్యత్తును మలుచుకోవచ్చునని, చదువుకునే వయసులో మొబైల్స్, సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ విషయంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.